సాక్షి ఒడిశా

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,46,274లు, బంగారం 1గ్రాము 50 మిల్లీగ్రాములు వెండి 141 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పరుగో.. పరుగు

నిరసన దళంపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో అంతా పరుగులు తీశారు.

- 8లో▸



ధాన్యం మండీ ప్రారంభం

మల్కాన్‌గిరిలో ధాన్యం మండీ ప్రారంభమైంది. ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు.

- 8లో▸

భూతలం..శీతలం



భువనేశ్వర్ మారుమూల ప్రాంతాల్లో చలి మంటల వెచ్చదనంతో ప్రజల కాలక్షేపం



సిమిలిపాల్ ప్రాంతంలో మంచు కప్పిన పచ్చిక నేల (ఇన్‌సెట్లో) రహదారులపై తగ్గిన దృశ్యమాన్యత

- రాష్ట్రంలో హిమపాతం
- సిమిలిపాల్‌లో 1 డిగ్రీ సెల్సియస్
- భువనేశ్వర్‌లో రికార్డు స్థాయిలో చలి

భువనేశ్వర్:

రాష్ట్రంలో చలి విజృంభిస్తోంది. మయూర్ భంజ్ జిల్లా అత్యధిక హిమపాతాన్ని చూస్తోంది. ఈ జిల్లా సిమిలిపాల్ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఉష్ణోగ్రత అత్యల్పంగా 1 డిగ్రీ సెల్సియస్‌కు దిగజారింది. సిమిలిపాల్ జాతీయ ఉద్యానం ఎగువ బొరాహకముడా పరిసరాల్లో మంచు కురిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కళింగ కాశ్మీరుగా పేరొందిన కంధమల్ జిల్లా దారింగ్‌బాడిలో కనిష్ట ఉష్ణోగ్రత 7.5 డిగ్రీల సెల్సియస్ నమోదై పరిసర ప్రాంతాల్లో చలి గాలులు వీస్తున్నాయి. మయూర్‌భంజ్ జిల్లా సిమిలిపాల్ ప్రాంతంలో వివిధ చోట్ల రాత్రి పూట ఉష్ణోగ్రత తీవ్రంగా దిగజారి పోయింది. సిమిలిపాల్ పరిసరాలు చొహలా ప్రాంతంలో 3 డిగ్రీల సెల్సియస్, నహానాలో 4 డిగ్రీలు, బరేహిపాణిలో 5 డిగ్రీలు, గుడగుడియాలో 6 డిగ్రీల సెల్సియస్‌లు ఉష్ణోగ్రత నమోదైంది. గత నాలుగు రోజులుగా సిమిలిపాల్‌లో క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. చలి మంటలతో ప్రజలు కాలక్షేపం చేస్తున్నారు.

నగరంలో రికార్డు స్థాయి చలి

రాజధాని నగరం వాతావరణం మునుపటి కంటే చల్లబడింది. భువనేశ్వర్ వాతావరణ శాఖ ఒడిశాలో తీవ్రమైన చలిని అంచనా వేసింది. భువనేశ్వర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో దిగజారి 10.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఝార్సుగుడ, సుందర్‌గఢ్, అంగుల్ జిల్లాలకు వాతావరణ శాఖ పసుపు హెచ్చరిక జారీ చేసింది. స్థానిక ప్రాంతీయ వాతావరణ శాఖ సోమవారం రాష్ట్రం అంతటా మరో 24 గంటలపాటు చలిగాలుల కారణంగా ఉష్ణోగ్రత మరింత తగ్గుముఖం పట్టి చలి తీవ్రత కొనసాగుతుందని హెచ్చరించింది. రాష్ట్రంలో మరి కొన్ని చోట్ల అత్యల్ప ఉష్ణోగ్రతతో చలితో గజగజలాడిస్తుంది. జి.ఉదయగిరిలో 6.6 డిగ్రీల సెల్సియస్, ఝార్సుగుడ, రౌర్కెలాలో కనిష్ట ఉష్ణోగ్రత 6.8 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితమైంది. రాత్రి పూట ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో దారులు కనిపించని పరిస్థితి నెలకొంది. ఉక్కు నగరం రౌర్కెలాలో ఈ పరిస్థితి నెలకొంది.

తేలికపాటి వర్షం

రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి వర్ష సూచన జారీ అయింది. ఈ నెల 17 మంగళ వారం పూరీ, గంజాం, గజపతి, రాయగడ, కొరాపుట్ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వాతావరణ శాఖకు చెందిన వాతావరణ వైజ్ఞానికుడు సంజీవ్ ద్వివేది తెలిపారు. రానున్న 2 రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలో పెద్దగా మార్పు ఉండదని, చలి గాలుల తీవ్రత వల్ల రాష్ట్రవ్యాప్తంగా సాధారణ జీవనం ప్రభావితం అవతుందని పేర్కొన్నారు. ఆ తర్వాత రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రత 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందస్తు సమాచారం అంచనా.

బాబోయ్ చలి

జయపురం: జయపురం చలికి వణుకుతోంది. ఆదివారం 12 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా సోమవారం ఉదయం 5 గంటల సమయంలో ఉష్ణోగ్రత 9 డిగ్రీలకు పడిపోయింది. పట్టణంలో పొగ మంచు దట్టంగా కమ్ముకుంటోంది.



ఉదయం 8 గంటల సమయంలో పట్టణంలో పొగమంచు



గాంధీ కూడలి వద్ద చలిమంటలు కాగుతున్న ప్రజలు



సీఎంజీ రోడ్డులో మంటలు వేసి చలి కాగుతున్న మునిసిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు

న్యూస్‌రీల్

ఆసక్తిగా క్రికెట్ పోటీలు



రెండో రోజు విజేతలు కొరాపుట్, సెమిలిగుడ టీమ్‌లు

జయపురం: స్థానిక విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్‌లో రెండో రోజు విజేతలుగా కొరాపుట్, సెమిలిగుడ కాలేజీ జట్లు నిలిచాయి. మొదటి మ్యాచ్ కొరాపుట్ కళాశాల, కుంద్ర బిజూపట్నాయిక్ డిగ్రీ కళాశాల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కొరాపుట్ కళాశాల టీమ్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 280 పరుగులు చేసింది. ఆ టీమ్ ఆటగాళ్లు నితీష్ 101 పరుగులు, బాపి 100 పరుగులు సాధించారు. 281 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కుంద్ర బిజూపట్నాయిక్ డిగ్రీ కళాశాల టీమ్ 18.1 ఓవర్లలో కేవలం 110 పరుగులకు ఆలౌటైంది. రెండో మ్యాచ్‌లో మల్కన్‌గిరి మోడల్ డిగ్రీ కాశాశాల, సెమిలిగుడ కళాశాల టీమ్‌లు తలపడ్డాయి. మల్కన్‌గిరి టీమ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో 132 పరుగులు చేసింది. 133 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన సెమిలిగుడ కళాశాల టీమ్ 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి విజయం సాధించింది.

బస్సు బోల్తా

- పదిమందికి స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన చొక్కాడొళా బస్సు

భువనేశ్వర్: ఖుర్దా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు బోల్తా పడింది. అదృష్టవశాతు ఈ బస్సులో ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పది మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరందర్ని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రిలో చేర్చారు. ఖుర్దా జిల్లా బఘొమరి–బెగుణియా రహదారిపై ఆదివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బర్‌గడ్ నుంచి భువనేశ్వర్‌కు వెళ్తున్న చొక్కాడొళా అనే ప్రైవేటు బస్సు బోల్తా పడి రోడ్డు పక్కకు ఒరిగింది. విషయం తెలియడంతో స్థానికులు రంగంలోకి దిగి బాధితులకు చేయూతనిచ్చి ఆదుకున్నారు. గాయపడిన వారిని ఖుర్దా జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు.

కొరాపుట్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు




కొరాపుట్ జిల్లా దమం జోడిలోని నాల్కో వద్ద 3.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన దృశ్యం

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో ఉష్ణోగ్రతలు అత్యల్పంగా పడిపోతున్నాయి. సోమవారం కొరాపుట్ జిల్లా దమంజోడి వద్ద భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో) వద్ద 3.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో సాయంత్రం 6 గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

శ్రీ మందిరంలో సేవాయత్‌ల కొట్లాట

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుడు కొలువు దీరిన పూరీ శ్రీ మందిరంలో ఒకే వర్గానికి చెందిన ఇద్దరు సేవాయత్‌లు కొట్లాటకు పాల్పడ్డారు. ఈ విచారకర సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వీరివురు ముఖొ పాఖాలొ వర్గీయ సేవాయత్‌లు. వాగ్యుద్ధంతో ఆరంభమైన వివాదం కొట్లాటకు దారి తీసింది. దీంతో వృద్ధ సేవాయత్ స్వల్పంగా గాయపడ్డాడు. ఇరువుర్ని స్థానిక సింహ ద్వారం ఠాణాలో పోలీసుల సమక్షంలో హాజరు పరిచిన సందర్భంగా కూడా ఒకరిపై ఒకరు చేయి చేసుకోవడం కలకలం రేపింది. కేసు నమోదు చేసి సింహద్వారం ఠాణా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పాదకం పంపిణీ పురస్కరించుకుని వీరివురి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం .

సనాతన ధర్మం గొప్పది



బైక్ ర్యాలీలో పాల్గొన్న భజరంగ్ దళ్, వీహెచ్‌పీ నాయకులు

పర్లాకిమిడి: మాసాంత సంక్రాంతి సందర్భంగా పట్టణంలో భజరంగ దళ్, విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో రాజావారి ప్యాలస్ నుంచి సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో సనాతన ధర్మం, హిందుత్వంపై చైతన్యం తేవడానికి ఈ నగర పరిక్రమ చేపట్టామని వీహెచ్‌పీ నాయకులు లోకనాథ మిశ్రా, కోశాధికారి హరి మోహన్ పట్నాయక్ తెలియజేశారు. అనంతరం హనుమాన్ మందిరం వద్ద చాలీసా పటించారు. ఈ ర్యాలీలో భజరంగ్ దళ్ పట్టణ అధ్యక్షుడు మనోజ్ దాస్, తరణీ ప్రసాద్ పాల్గొన్నారు.

పత్రికలు సమాచార వారధులు



మినీ మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించిన చైర్మన్ మహంతి



మినీ మారథాన్‌లో బహుమతులు పొందిన విజేతలు

జయపురం: పత్రికలు, ప్రజలకు, పాలకులకు మధ్య వారధిగా ఉన్నప్పుడే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి అన్నారు. 'సాకాలో' ఒడియా దినపత్రిక తన నాలుగేళ్ల వార్షిక దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించి మినీ మారథాన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ పార్కింగ్ కేంద్రం నుంచి ప్రధాన మార్గం మీదుగా రథొపాడియ వరకు సాగిన మినీ మారథాన్‌లో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో దిలీప్ ఖొర ప్రథమ, గోపీ ఖెముండు ద్వితీయ, ధనస తుమురి తృతీయ స్థానాలలో నిలిచారు. బాలికల గూపులో గౌరీ కిరిసాని, దయామణి హరిజన్, సంజనా మఝి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అలాగనే జూనియర్ గ్రూపులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్న చెల్లెల్లు జమున బహదూర(13), హరిష్ బహదూర్(10) తపస్య బహదూర్(8) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. సీనియర్ సిటిజన్‌లో ఎ.మురళి గెలిచారు.

ధనుర్మాస ప్రారంభ వేడుకలు



శ్రీ ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు చదువుతున్న ఎ.రాజగోపాలచారి

పర్లాకిమిడి:

స్థానిక కోమటి వీధి దిగువ వేంకటేశ్వర ఆలయంలో సోమవారం ఉదయం నెలగంట వేశారు. సూర్యుడు ధనురాశిలో ప్రవేశించిన కారణంగా నేటి నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుంది. అలాగే కేవుటి వీధిలో శ్రీప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో కూడా నెలగంట కార్యక్రమం ఉదయం ఐదు గంటలకు పూజారి ఎ.రాజగోపాలచారి ఘనంగా నిర్వహించారు. నేటి నుంచి వేంకటేశ్వర ఆలయంలో వేకువ జాము నుంచి స్వామికి ఇష్టమైన తిరుప్పావై ప్రవచనాలు భోగి పండగ వరకూ చదువుతారు. అలాగే రోజూ స్వామి వారికి ఇష్టమైన పొంగలి నైవేద్యాన్ని సమర్పిస్తామని పూజారి శ్రీనివాసా చార్యులు తెలియజేశారు.

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని శ్రీకళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలను భక్తి శ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. సుప్రభాత సేవలతో ప్రారంభమైన పూజా కార్యక్రమాల అనంతరం అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. మహిళలు స్వామి వారి సహస్రనామాల పఠనం చేశారు. ధనుర్మాసం విశిష్టత, ఈ మాసంలో నిర్వహించే పూజా విధానాల గురించి అర్చకులు వివరించారు.



నెలగంటకు పూజలు చేస్తున్న భద్రం శ్రీనివాసా చార్యులు



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భాస్కరాచార్యులు



వేంకటేశ్వర సహస్ర నామాలను పఠనం చేస్తున్న మహిళలు

179 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: అక్రమంగా తరలిస్తున్న 179 కిలోల గంజాయిని జిల్లాలోని మునిగుడ పోలీసులు పట్టుకున్నారు. దీనితో సంబంధం ఉన్న ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఎస్‌డీపీవో సంతోషిణి ఓరం, ఐఐసీ సౌదామిని బెహర తెలిపిన వివరాల ప్రకారం.. మునిగుడ సరిహద్దులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అంబొదల నుంచి వస్తున్న ఒక వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో ఎనిమిది బస్తాల్లో ఉన్న 179 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాంగనీస్ లోడ్‌తో ట్రాక్టర్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్



అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న కారు

- ముగ్గురి అరెస్టు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి అటవీ రేంజ్ పరిధి లెల్లిగుమ్మ సంరక్షిత అడవుల నుంచి విలువైన మాంగనీస్ రాళ్లను ట్రాక్టర్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో రాయగడ కస్తూరనగర్‌కు చెందిన ఎ.రవణ, ఎ.శివ, ఛబీంద్ర మాఝిలు ఉన్నట్లు అటవీ శాఖ రేంజర్ అనిల్ కుమార్ పాణిగ్రాహి తెలిపారు. విలువైన మైనింగ్ రాళ్ల అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సామవారం తెల్లవారు జామున నిర్వహించిన ఈ దాడుల్లో ట్రాక్టర్‌తో పాటు స్విఫ్ట్ కార్‌ను కూడా స్వాధీనం చేసినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న మైనింగ్ రాళ్ల విలువ సుమారు ఐదు లక్షల రూపాయలు ఉంటుందని చెప్పారు. మాంగనీస్ రాళ్లను ఆంధ్రాకు తరలిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు.

అటవీ శాఖ సిబ్బందిపై దుండగుల కాల్పులు

- ఏనుగు దంతాల మాఫియా దురాగతం
- ఐదుగురు అరెస్టు
- రెండు ఏనుగు దంతాలు స్వాధీనం



అధికారుల దాడిలో పట్టుబడిన నిందితులు

రాయగడ: ఏనుగు దంతాలను అక్రమంగా తరలించడంతో పాటు వాటిని అమ్మేందుకు డీల్ జరుగుతుందన్న సమాచారంతో అటవీ శాఖ అధికారులు మెరుపు దాడులను నిర్వహించారు. ఏనుగు దంతాల మాఫియాను పట్టుకున్నారు. అయితే ఈ డీల్‌లో మరికొందరు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వారిని కూడా పట్టుకునే ప్రయత్నంలో భాగంగా వారిని వెతుకుతున్న సమయంలో మాఫియా ముఠా సభ్యులు అటవీ శాఖ అధికారులపై తుపాకులతో నాలుగు రౌండ్ల కాల్పులు జరిపారు. సంచలం సృష్టించిన ఈ సంఘటన రాయగడ జిల్లాలోని మునిగుడ అటవీ రేంజ్ పరిధి జరఫా ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకోగా.. ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మునిగుడ అటవీ రేంజ్ పరిధి మలిముండ, జరఫా ప్రాంతాల్లో ఏనుగు దంతాల క్రయవిక్రయాలకు సంబంధించి మాఫియాలు డీల్ కుదుర్చుకుంటున్నారన్న సమాచారంతో మునిగుడ ,అంబొదల అటవీ అధికారులతో పాటు పొరుగు జిల్లా కలహండి అటవీ అధికారులు శనివారం జరఫా ప్రాంతంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురిని పట్టుకున్న అధికారులు వారివద్ద నుంచి రెండు ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో ముగ్గురు రాయగడకు చెందిన వారు కాగా.. మరో ఇద్దరు కలహండి జిల్లాకు చెందిన వారుగా సమాచారం. ఈ సంఘటనకు సంబంధించి నిందితులతో పాటు మరి కొందరు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వారిని పట్టుకునే ప్రయత్నంలో అటవీ ప్రాంతం గుండా వెళ్లారు. ఇది తెలుసుకున్న దుండగులు వారిపై కాల్పులకు తెగబడ్డారు. చీకట్లో జరిపిన కాల్పులతో అటవీ శాఖ సిబ్బంది ఆందోళనకు చెంది తాము తెచ్చుకున్న బొలేరో వాహనంలోకి దూరిపాయారు. అయితే అంతటితో ఆగని దుండగులు వారిని హతమార్చే ప్రయత్నంలో బొలేరో వెనుక గల గ్లాస్‌ను మారణాయుధాలతో పగలగ్గొట్టారు. అనంతరం అక్కడి నుంచి ఫరారయ్యారు. దుండగుల కాల్పుల కారణంగా బొలేరో డోర్‌కు తుటా తగిలి రంధ్రం ఏర్పడింది. అటవీ సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురైనప్పటికీ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అరెస్టయిన ఐదుగురిపై కేసు నమోదు చేసిన పోలీసు అధికారులు నిందితులను దర్యాప్తు చేసిన అనంతరం సామవారం కోర్టుకు తరలించారు.



బొలెరో వాహనం వెనుక పగిలిన అద్దాలు



దుండగుల కాల్పులకు వాహనం డోర్ వద్ద ఏర్పడిన రంధ్రం

క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

జయపురం: జనవరి 31వ తేదీ లోగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కొరాపుట్ జిల్లా కృషక్ కల్యాణ మంచ్ డిమాండ్ చేసింది. కృషక కల్యాణ మంచ్ ప్రతినిధులు జయపురం వచ్చిన ముఖ్యమంత్రిని మోహణ చరణ మఝిను కలిసి 6 డిమాండ్లతో వినతి పత్రం సమర్పించారు. ఖరీఫ్ ధాన్యం మండీలలో నెలకొంటున్న సమస్యలను వివరించారు. చత్తీష్‌గఢ్‌లోని మండీలలో అమలు చేస్తున్న ధాన్యం కొనుగోలు విధానాన్ని ఒడిశాలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎఫ్‌ఏక్యూ పేరుతో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సాగునీటి సౌకర్యంలేని భూములలో ఒక ఎకరాకు 13 క్వింటాళ్ల ధాన్యం కొంటే రైతులు నష్టపోతారని, మిగిలిన దాన్యం తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తుందన్నారు. ఎకరాకు 25 క్వింటాళ్ల ధాన్యం ఖరీదు చేయాలన్నారు. రైతులకు ఖాళీ గోనె సంచులు సమకూర్చాలని కోరారు. జయపురంలో గల కృషక భవనాన్ని రైతులు వినియోగించేందుకు ఇవ్వాలన్నారు. అవిభక్తి కొరాపుట్ జిల్లాల కృషక సమాజ్, కృషక కల్యాణ మంచ్ సభ్యులను డీఎల్‌పీసీ సమావేశంలో పాల్గొనే అవకాశం కల్పించాలన్నారు.

తితిదే సౌజన్యంతో తిరుప్పావై ప్రవచనాలు


ప్రవచనాలు చెబుతున్న శ్రీనివాసాచార్యులు

పర్లాకిమిడి: ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా స్థానిక కోమటి వీధిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం తిరుప్పావై ప్రవచనాలు భద్రం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. గోదాదేవి శ్రీరంగం శ్రీనివాసుల ఇతి వృత్తాంతం పండితులు శ్రీనివాసాచార్యులు సోమవారం తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం అళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు వారి సౌన్యంతో నెల రోజుల పాటు గోదాదేవి భక్తితో శ్రీరంగం శ్రీనివాసులకు భక్తితో సమర్పించిన పాశురాలను భక్తులకు వివరిస్తారు. రోజూ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమవుతుంది. భోగి పండుగ రోజున గోదాదేవి శ్రీరంగం శ్రీనివాసుల కళ్యాణంతో ప్రబంధాలు ముగుస్తాయి.

వాహనాల తనిఖీ


వాహన తనిఖీల కోసం సిద్ధంగా ఉన్న పోలీసులు

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ మొదటి గేటు వద్ద సోమవారం సాయంత్రం గురండి పోలీసు అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. మొబైల్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేయడం, సీటు బెల్టు లేని కార్ల డ్రైవర్లు, హెల్మెట్ లేని వాహనదారులను చెక్ చేసి పలువురికి జరిమానాలు విధించారు. సుమారు రూ.4 వేలు జరిమాలు విధించామని ఏఎస్సైలు ఆర్.కె.చౌదురి, సుకాంత దోళాయి తెలిపారు.

చెరువులో మునిగి నాలుగేళ్ల చిన్నారి మృతి


చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు ఇతర బంధువులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి వేంఛన్‌పల్లి గ్రామంలో సోమవారం పుష్ప ముళి (4) అనే బాలిక చెరువులో మునిగి చనిపోయింది. ఉదయం 8 గంటల సమయంలో పుష్ప చెరువు వద్దకు ఆడుకోవడానికి వెళ్లింది. తల్లి వరి కోతల పనికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి బిడ్డ కనిపించలేదు. అంతలో చెరువు వద్ద ఓ మృతదేహం తేలుతూ కనిపించడంతో అటుగా వెళ్తున్న వారు చూసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. వారు వచ్చి బయటకు తీసి చూడగా ఆ మృతదేహం బాలికదిగా తేలింది. దీంతో ఎస్‌ఐ నిరంజన్‌కుమార్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.


పరబ్ వేడుకలను తిలకిస్తున్న ప్రజలు


పరబ్ వేడుకలు ప్రారంభిస్తున్న సీఎల్పీ నాయకుడు రామచంద్ర ఖడం


పరబ్ మైదానం

అదరహో..

- అలరించిన రెండో రోజు పరబ్ వేడుకలు
- ఉత్సాహంగా పాల్గొన్న కళకారులు, ప్రజలు

కొరాపుట్: రాష్ట్ర స్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవం పరబ్–2024 వేడుకలు రెండో రోజు అలరించాయి. కొరాపుట్ జిల్లా కేంద్రానికి సమీపంలోని పరబ్ గ్రౌండ్స్‌లో వేలాది మంది ప్రజల మధ్య సాంస్కృతిక సంబరాలు సోమవారం జరిగాయి. కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క, సీఎల్పీ నాయకుడు రామచంద్ర ఖడం, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత తదితరులను కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్ పరబ్ జ్ఞాపికలతో సత్కరించారు. అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలను చలి వణికిస్తున్నప్పటికీ ప్రజలు ఆసక్తిగా తిలకించారు.


బిహూ నృత్య ప్రదర్శన


అస్సాం కళాకారుల ప్రదర్శన


సంబల్‌పురి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న గిరిజన మహిళలు

ధాన్యం మండీ ప్రారంభం


మండీని ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్


ధాన్యం నాణ్యతను చూపుతున్న సిబ్బంది


మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ఆర్ఎంసీ కార్యాలయం వద్ద ధాన్యం మాండీని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ సోమవారం ప్రారంభించారు. జిల్లాలోని మల్కన్‌గిరి, కలిమెల, పోడియా, మత్తిలి, కోరుకొండ, ఖోయిర్‌పుట్, చిత్రకొండ సమితుల్లో మొత్తం 52 మండీలను ఏర్పాటు చేశారు. ప్రథమ రకం రూ.2,300, సబ్సిడీ ధర ఇన్‌పుట్ రూ.800తో మొత్తం రూ.3100, ద్వితీయ రకానికి రూ.2,800, మూడో రకానికి రూ.2,400 చొప్పున ధరను నిర్ణయించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా నుంచి 9 లక్షల 24 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతు అకౌంట్‌లో డబ్బులు జమవుతాయన్నారు. నవరంగ్‌పూర్ ఎంపీ బోలభద్ర మాఝి, మల్కన్‌గిరి కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, ఆర్ఎంసీ జిల్లా అధికారి దేవినాథ్ త్రిపాఠి, మల్కన్‌గిరి ల్యాంప్ సిబ్బంది, జిల్లా రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తల్లి ఆప్యాయతకు ప్రతీక పౌహాలి భోగం

భువనేశ్వర్: ఏడాది పొడవునా 11 నెలలు భార్య చేతి వంటకాలు ఆరగించే స్వామి ఒక నెల రోజులపాటు పెంచిన తల్లి చేతి వంటకాల్ని ఆరగిస్తాడు. యశోద గారాల బిడ్డ శ్రీ కృష్ణునికి చేతి వంటకాలను ఆరగింపజేసే ధార్మిక స్మృతికి ప్రతీక పౌహలి భోగంగా (ప్రాతః భోగం) పేర్కొంటారు. పుష్య మాసంలో మహాలక్ష్మి పుట్టింటికి పయనం కావడంతో యశోద జగన్నాథునికి నిత్యం తెల్లవారుజామున వంట చేసి, చలిగా ఉన్న సమయంలో వేడి వేడిగా పలు రకాల వంటకాల్ని సమర్పిస్తుంది

పుష్య మాసం తొలి రోజు ధను సంక్రాంతి మొదలుకొని ఉత్తరాయణ సంక్రాంతి (మకర సంక్రాంతి) ముందు రోజు వరకు ఈ పౌహలి భోగ సేవ నిరవధికంగా నెల రోజులపాటు కొనసాగుతుంది. నిత్యం గోపాల వల్లభ భోగం తర్వాత పౌహలి భోగం సేవ నిర్వహించడం ఆచారం. ఈ సందర్భంగా నిత్యం రాత్రి 2 గంటలకు గుడి తలుపులు తెరుస్తారు. వేకువజామున కోడి కూతకు ముందే ప్రాతః భోగం నివేదించడం సంప్రదాయం. వేకువ జాము 3 గంటలకు మంగళ హారతి, 3.30 గంటల నుంచి 5 గంటల మధ్య మైలమ్ ఇతరేతర సేవాదులు ముగించి 5 గంటలు సరికి అలంకరణ పూర్తి చేస్తారు.

ఈ 24 రకాల నైవేద్యాల్లో గోధుమ పిండి, మినుములతో చేసిన పిండి వంటల అధికంగా ఉంటాయి. అంబాలు, ఛొత్తు, కకేరి, గొంయితి, టికిలి, తొరాసు వాటొడా, ముగేయి, కొంటియి, బొడొ ఝిలీ, ధొరొసువా బొడి, ధొరొసువా ఝిలీ, లడ్డు, అరిసె, ఎండూరి, కాజా, ఖీర్ చుల్, మొండా, చవుడా పువా తదితర పిండి వంటకాలు సమర్పిస్తాయి.



స్వామికి నివేదించే ప్రాతః భోగం పదార్థాలు

వాటాదారులకు మాత్రమే

జగన్నాథునికి నివేదించిన అత్యంత ప్రీతికరమైన ప్రాతః భోగం పదార్థాలు సాధారణ భక్తులకు లభించవు. స్వామి సేవకులకు మాత్రమే పరిమితం. ఈ ప్రసాదం అమ్మకానికి వీలు లేదు. సేవాయత్‌ల మధ్య పంపిణీ జరుగుతుంది. కొంత భాగం స్వామి ఆద్య సేవకుడు పూరీ గజపతి మహా రాజాకు వాటాగా అందజేస్తారు. దేవుళొ కొరొణొ, తొడొవు కొరొణొ మహా రాజా వాటాని అందజేస్తారు. వంటకం చేసిన నిత్యం స్వామివారి సేవాదులు నిర్వహించే సేవకులకు ఈ ప్రసాదాన్ని అందజేస్తారు. వోగ్‌ని రూపొందించిన సువార్ మహా సువార్ సేవకులు స్వల్ప వాటా లభిస్తుంది.

శబరపల్లి పంచాయతీలో స్పందన కార్యక్రమం

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి సమితి శవరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం జాయింట్ గ్రీవెన్సు సెల్ జరిగింది. ఈ స్పందన కార్యక్రమానికి కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్, ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, బీడీఓ లారీ మాన్ ఖర్సల్, బ్లాక్ అధ్యక్షురాలు లక్ష్మీనారాయణ శోబోరో, సర్పంచ్ పుల్లమతి రయితో తదితరులు పాల్గొన్నారు. పోడాసింగి, బలపంక, అనుకుండ, శబరపల్లి గ్రామాల నుంచి కలెక్టర్‌కు అర్జీలు అందాయి. అనంతరం మహిళా స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేసిన చోళ్లు, రాగులతో చేసిన రాగుజావ, పిండివంటల స్టాల్‌ను పరీక్షించారు.


శవరపల్లిలో భూపట్టాలు అందజేస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పరుగో... పరుగు

భువనేశ్వర్: తేనెటీగల దాడితో నిరసన ప్రదర్శిస్తున్న ఒడిశా విద్యార్థి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పరుగులు తీశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఐఏఎస్ బిష్ణుపద సెఠి అధికారిక నివాసం ముందు సోమవారం కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ చేదు అనుభవం ఎదురైంది. రూ. 10 లక్షల లంచం కేసులో బిష్ణుపద సెఠిని అరెస్ట్ చేయాలని డిమాండ్‌తో వీరు ఆందోళనకు దిగారు. తేనెటీగల గుంపు దాడి చేయడంతో పోలీసు సిబ్బంది, పాత్రికేయులు పరుగులు తీశారు.


నినాదం పతాకాన్ని చుట్టుకుని తేనెటీగల దాడి నుంచి రక్షణ పొందిన విద్యార్థి కాంగ్రెస్ కార్యకర్త


యువజన కాంగ్రెసు పతాకం చాటున ముఖానికి రక్షణ కల్పించుకున్న కార్యకర్తలు

అగ్ని ప్రమాదంలో సామగ్రి దగ్ధం


కాలిపోయిన టీవీ


దగ్ధమైన సామగ్రి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల 11వ వార్డులో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. హిమాన్షు శఖర్ సాహు అనే వ్యక్తి ఇంట్లో ఏవరు లేని సమయంలో టీవీ నుంచి మంటలు వచ్చాయి. మంటలు ఇంటి మొత్తం వ్యాపించడంతో వ్యాపించాయి. వివిధ పనులపై వెళ్లిన కుటుంబ సభ్యులు వచ్చేసరికి మంటలు కనిపించడంతో ఆందోళన చెందారు. స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో లక్షలాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా టీవీ నుంచి మంటలు వచ్చి ఉండవచ్చునని భావిస్తునాన్ర.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

రాయగడ:

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల వద్దకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సురేష్ పూజారి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయగడలో ఒక్కరోజు పాటు పర్యటనకు వచ్చిన ఆయన ఈ మేరకు స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ ఫరూల్ పట్వారి, సబ్ కలక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహట, అధికారులు, రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర రెవెన్యూ విభాగంలో పలు సంస్కరణలు వస్తాయని తెలిపారు. ఆధునిక, సాంకేతిక పద్ధతిలో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో గల పేదలందరికీ ఇళ్ల పట్టాలను వచ్చే ఏడాది చివరి నాటికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అంతకు ముందు మంత్రి స్థానిక మజ్జిగౌరి మందిరానికి వెళ్లి అమ్మ వారిని దర్శించుకున్నారు. వారి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, ఎస్సీ ఎస్టీ మోర్చ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు కాశీరాంమాఝి, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పూజారి, పక్కనే కలెక్టర్ పట్వారి తదితరులు


సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు


సింగార్ సుశాంతో శేఖర్

సందడే సందడి

జిల్లా స్థాయి మాల్యవాంత్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ హాజరయ్యారు. మల్కన్‌గిరి రెండు సబ్ విద్యుత్ స్టేషన్లను ఆదివారం ప్రారంభించారు. జిల్లా జరిగిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సినీ తారలు సందడి చేశారు. ఒడియా సినీ పరిశ్రమకు చెందిన హీరో, హీరోయిన్లు వచ్చారు. ప్రముఖ గాయకుడు సుశాంత్ శేఖర్, హీరోయిన్ ప్రకృతి మిశ్రో, హీరో సందీప్, సిగ్నేచర్ బ్యాండ్ పార్టీ బృందం, సోహిని మిశ్రో, తదితరులు సందడి చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి


పడవ పందెంలో మొదటి స్థానంలో నిలిచిన సింద్రీమాల జట్టుకు బహుమతి అందజేసిన డిప్యూటీ సీఎం కనకవర్ధన్ సింగ్‌దేవ్


నృత్య ప్రదర్శనలో విద్యార్థులు


హీరోయిన్ ప్రకృతి మిశ్రో


గాయని సోహిని మిశ్రో

క్లుప్తంగా

నీటి సంఘాల ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: సాగునీటి సంఘాల ఎన్నికలతో పాటు ఏ ఎన్నికలైనా సజావుగా జరిగితే సాలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే అధికంగా గెలుస్తారని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తన స్వగృహానికి సాలూరు మండలం పురోహితునివలస నాయకులు వచ్చి తమ పంచాయతీలో నీటి సంఘాల ఎన్నికలు జరిగిన తీరు, ఎన్నికల అధికారిణి అధికార పార్టీకి వత్తాసు పలికే విధంగా ప్రవర్తించారని రాజన్నదొరకు వివరించారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ, అధికార యంత్రాంగం పూర్తిగా అధికారపార్టీకి లోబడిన ప్రాంతాల్లో టీడీపీ సానుభూతిపరులు గెలిచారని ఆరోపించారు. ఈ ఎన్నికలను బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించిందని గుర్తు చేశారు.

బొబ్బిలి చీర పరిశీలన



నారాయణపురంలో చీరను పరిశీలిస్తున్న అధికారులు

బలిజిపేట: ఒకే జిల్లా ఒకే ప్రొడక్ట్ కింద బలిజిపేట మండలంలోని నారాయణపురంలో తయారుచేసిన బొబ్బిలి చీరను ఢిల్లీ బృందం సోమవారం పరిశీలించింది. ఒకే జిల్లా ఒకే ప్రొడక్ట్‌లో భాగంగా నారాయణపురంలో తయారుచేసిన 100/100 కౌంట్ చీరలను హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వాటిని పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి కేంద్రబృందం వచ్చింది. చీరల తయారీని, చీరలను వారు పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన తరువాత ఉత్తర్వుల మేర దీనిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఒకే జిల్లా ఒకే ప్రొడక్ట్‌లో ఇటువంటి వాటిని మరెక్కడా తయారుచేసిన దాఖలాలు లేనందున దీనిని హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ శాఖ దరఖాస్తు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధులు డాక్టర్ దివ్య, సోనియా, హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ ఎ.డి జనార్దన్, ఏడీఓ రమణ, డిజైనర్ ప్రసాద్, స్థానిక చేనేత కార్మికులు పాల్గొన్నారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

గంట్యాడ: మండలంలోని పెంట శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు చీరకు నిప్పంటుకోగా జరిగిన ప్రమాదంలో మృతిచెందింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆడపా నారాయణమ్మ గ్యాస్ స్టవ్‌పై మరుగుతున్న టీ గిన్నెను చీర కొంగుతో కిందకి దించే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకోవడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్సులో విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నంలోని సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.నాలుగువేలు జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మెంటాడ మండలానికి చెందిన బాలిక విజయనగరం పట్టణంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో 2020లో ఇంటర్‌మీడియట్ చదువుతున్న సమయంలో విశాఖ జిల్లా పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఐతి అప్పలనాయుడితో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆ బాలికను పెళ్లి చేసుకుంటానని ఆటో డ్రైవర్ నమ్మించి తన ఆటోలో వేర్వేరు ప్రాంతాలకు తీసుకువెళ్లి పలుమార్లు శారీరకంగా లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, కేసు నమోదైంది.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మక్కువ: మండలంలోని 33/11 మావుడి సబ్‌స్టేషన్ పరిధిలో గల 11కేవీ చింతలవలస ఫీడర్, 33 కేవీ మామిడిపల్లి నుంచి మావుడి ఫీడర్స్ దగ్గర ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం మంగళ, బుధవారాలలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పార్వతీపురం విద్యుత్ శాఖ ఈఈ కె.గోపాలరావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. త్రీఫేస్ సప్లై ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు ఉంటుందన్నారు. అంతరాయానికి చింతిస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాకం ముదిరి బెల్లం..!

- నదీతీరంలో జోరుగా తయారీ
- రేగిడి, సంతకవిటి మండలాల్లో రైతులు బిజీ
- మార్కెట్‌లో టన్ను బెల్లం రూ.42 వేలు
- ఎకరా సాగులో 3నుంచి 4 టన్నులు లభ్యం
- నాగావళి తీరంలో అధికంగా గానుగలు



కోతదశలో చెరకు పంట

రాజాం/రేగిడి: పండగ రోజులు దగ్గరపడ్డాయి. అందులో సంక్రాంతి పండగ అంటే పిండివంటలకు ప్రత్యేకం. వారం రోజులు ముందునుంచే పలువురి ఇళ్లలో బెల్లంతో తయారుచేసే పిండివంటలు సిద్ధమవుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే తమ కుటుంబసభ్యులు, బంధువులకు కమ్మని చేతివంటలు పెట్టాలని అందరూ తాపత్రయ పడుతుంటారు. ప్రధానంగా బెల్లంతో తయారుచేసే అప్పాలు, వరిపిండి ఉండలు, అరిసెలు, పప్పుబూరెలు, బెల్లం కొబ్బరి ఉండలు, పల్లీ ఉండలకు ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. ఈ నేపథ్యంలో బెల్లానికి డిమాండ్ ఉంటుంది. ఇదే అదునుగా చెరకు సాగుచేసే రైతులు బెల్లం తయారీలో బిజీ అయ్యారు. ప్రధానంగా నాగావళి నదీతీరంలో ఏపుగా పెరిగే చెరకుతో తయారీచేసిన బెల్లానికి మంచి రుచి, డిమాండ్ ఉంటుంది. రేగిడి, సంతకవిటి మండలాల్లోని నాగావళి నదీతీరాల్లో ఈబెల్లం తయారీ నోరూరిస్తోంది.

బిజీగా రైతులు..

జిల్లాలో కేవలం సంకిలి వద్ద మాత్రమే ప్యారీస్ చక్కెర ఫ్యాక్టరీ ఉంది. అక్కడికి చెరకును రైతులు పంపిస్తారు. మిగిలిన రైతులు బెల్లం తయారు చేసి విక్రయిస్తారు. నాగావళి నదీతీర మండలాలైన వంగర, రేగిడి, సంతకవిటిలలో చెరకు ఏపుగా పెరుగుతుంది. పంట కూడా తియ్యగా ఉండడంతో బెల్లం తయారీలో ఎటువంటి రసాయనాలు వినియోగించకుండానే రంగు రావడంతో పాటు తియ్యదనం వస్తోంది. దీంతో సంతకవిటి మండలంలోని కొత్తూరు, జావాం, హొంజరాం, చిత్తారిపురం, బూరాడపేట, రేగిడి మండలంలోని ఖండ్యాం, కొమెర ప్రాంతాల్లోని బెల్లానికి మంచి డిమాండ్ ఉంటుంది. ఇక్కడ బెల్లం గానుగల వద్దే విక్రయాలు జరిగిపోతుంటాయి.



నోరూరించే బెల్లం పానకం

బెల్లం తయారీలో దిగుబడి ఇలా..

- ఎకరాకు అవసరమయ్యే విత్తనాలు : 10 గరిసెలు(2 టన్నులు)
- చెరకు దిగుబడి : 40 నుంచి 50 టన్నులు
- బెల్లం దిగుబడి : నాలుగు టన్నులు
- బెల్లం ధర మార్కెట్‌లో : రూ. 39 వేల నుంచి రూ.42 వేలు
- ఎకరాకు అయ్యే ఖర్చు : రూ.50 వేలు
- చెరకు సాగయ్యే నేలలు : ఇసుకనేలలు, నల్లమట్టి నేలలు
- ఎకరా పంట బెల్లం తయారీకి పట్టే కాలం: 15 రోజులు

కుండల నుంచి చక్కీల వైపు..

ఎకరా చెరకు పంటను బెల్లం తయారీ చేసేందుకు సాధారణంగా 15 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. పొలంలో చెరకును నరికి ఎండ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా గానుగల వద్దకు తీసుకొస్తారు. అక్కడ చెరకు గడలను నునుపుగా చేసి గానుగ యంత్రం ద్వారా రసం తీస్తారు. ఈ రసం ఇనుప పెనంలో వేసి పాకం తీస్తారు. బాగా పాకం వచ్చిన తరువాత పక్కనే ఉన్న ఇనుప పళ్లెంలో పాకం వేసి చెక్కీలు తయారీచేస్తారు. గతంలో బెల్లాన్ని కుండలకు ఎక్కించేవారు. ఇప్పుడు టెక్నాలజీ రావడంతో చెక్కీలకు ఎక్కించి, అనంతరం కవర్లలో పెట్టి మార్కెట్‌కు తరలిస్తారు. చిన్న చెక్కీ 6 నుంచి 7 కిలోలు ఉండగా, పెద్ద చెక్కీలు 14 కిలోలు ఉంటాయి.

బెల్లం ధర కలిసి వస్తుందని

ఈ ఏడాది చెరకు సాగు బాగుంది. ప్రస్తుతం పంట కోతదశకు వచ్చింది. బెల్లం తయారుచేసే రైతులకు అన్ని విధాలా అనుకూలంగా ఉంది. మార్కెట్ ఉంది. గ్రామాల్లో వీటిని విక్రయిస్తున్నాం. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పంట దిగుబడి బాగుంది.

– ఎం.నాగబాబు, బూరాడపేట, సంతకవిటి మండలం.

ఈ ప్రాంత బెల్లానికి డిమాండ్..

ప్రస్తుతం చెరకు పంట అన్ని ప్రాంతాల్లో కోతదశలో ఉంది. మేం చెరకును గానుగ ఆడించి బెల్లం తయారుచేస్తున్నాం. బెల్లానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. మాకు పెట్టుబడులు పోను లాభం కనిపిస్తుంది. రైతులు కూడా బెల్లం తయారీపై దృష్టిసారించారు. సంక్రాంతి ముందు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. మా ప్రాంత బెల్లానికి డిమాండ్ ఎక్కువ.

– మజ్జి రామారావు, రైతు, ఖండ్యాం, రేగిడి మండలం

రామతీర్థంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



ఆలయ ప్రాంగణంలో తిరుప్పావై ప్రవచనాలు చదువుతున్న ప్రధాన అధ్యాపకుడు నరసింహాచార్యులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పవిత్ర ధనుర్మాస ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత తూర్పు రాజగోపురం నెలగంటు కార్యక్రమానికి అర్చకులు శ్రీకారం చుట్టారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ధనుర్మాస ఉత్సవాలను ప్రారంభించారు. గోదా దేవిని పల్లకిలో వేంచేపుజేసి బేడాలో ఊరేగించారు. ఆలయ ప్రధాన అధ్యాపకుడు గొడవర్తి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 13వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరుప్పావై ప్రవచనాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుగులతో నష్టపోయిన పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న పీసీ సీఎఫ్ఓ చిరంజీవి చౌదరి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ, పెదకుదమ గ్రామాల్లో ఏనుగుల వల్ల నష్టపోయిన పంట పొలాలను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పీసీ సీఎఫ్ఓ చిరంజీవి చౌదరి, డీఎఫ్ఓ ప్రసన్న కుమారి సోమవారం పరిశీలించారు. ఏనుగుల వల్ల నష్టపోయిన పంటల వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.రైతులు కూడా వారివారి ఇబ్బందులను వివరించారు. అటవీశాఖ పీసీ సీఎఫ్ఓ రైతుల సమస్యలను విని సానుకూలంగా స్పందించారు. వరి, అరటి, చెరకు, పామాయిల్ పంటలు పూర్తిగా ధ్వంసం చేశాయని, గడిచిన చాలా సంవత్సరాల నుంచి ఏనుగులు ఇక్కడే సంచరిస్తున్నాయన్నారు. చినకుదమ, పెదకుదమ, గౌరీపురం, బాసంగి, వెంకటరాజపురం, బిత్రపాడు,బట్లభద్ర గ్రామాలలోనే తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని గ్రామ నాయకుడు డొంకాడ రామకృష్ణతో పాటు చినకుదమ,పెదకుదమ గ్రామస్తులు వారివారి సమస్యలను విన్నవించుకున్నారు.ప్రభుత్వం నుంచి తగు సహాయం అందించడానికి చర్యలు తీసుకుంటామని రైతులకు అటవీశాఖాధికారులు హామీ ఇచ్చారు.

గిరిజన జేఏసీ సంఘీభావం



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న గిరిజన జేఏసీ నాయకులు

సీతంపేట: గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల రిలేనిరాహార దీక్షలు 27వ రోజు కొనసాగాయి. ఈ మేరకు ఆదివాసీ గిరిజన జేఏసీ నాయకులు ఆ దీక్షలకు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దాదాపు నెల రోజులుగా అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు శాంతియుత ర్యాలీలు, రిలేనిరాహార దీక్షలు, సమ్మెలు చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేకపోవడం విడ్డూరంగా ఉందని, గిరిజన విద్యార్థుల చదువులు పూర్తిగా ఆగిపోయాయన్నారు. పాఠాలు బోధించే వారు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. టెన్త్, ఇంటర్ సిలబస్ 50 శాతం కూడా పూర్తికాని పరిస్థితి ఉందని, విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు ఎలా రాస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అవుట్‌సోర్సింగ్ టీచింగ్‌స్టాఫ్ సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.ఉమామహేశ్వరరావు, ఎస్.గంగారావు, గణేష్, నాగేశ్వరరావు, అబ్బాస్, సింహాచలం, హరిప్రసాద్, సర్పంచ్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి

- గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రమాదం



ఆర్మీ ఉద్యోగి ఈశ్వరరావు మృతదేహం

చీపురుపల్లిరూరల్(గరివిడి): చీపురుపల్లి–రాజాం ప్రధాన రహదారిలో గరివిడి మండలం కాపుశంభాం–అప్పన్నవలస జంక్షన్ల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొడంతో జరిగిన ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానికుల తెలిపిన వివరాల మేరకు మెరకముడిదాం మండలం భీమవరం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బందపు ఈశ్వరరావు, భార్య వినూత్నతో కలిసి ద్విచక్రవాహనంపై చీపురుపల్లి వైపు వస్తున్నారు. సాయంత్రం 6:30 ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై భార్యాభర్తలు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో భర్త ఈశ్వరరావు మృతి చెందగా భార్య వినూత్నకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108లో వారిని చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మృతుని భార్యను విజయనగరం ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు.

లారీ ఢీకొని ఎక్స్ సర్వీస్‌మన్ మృతి



మృతి చెందిన చొక్కాపు సింహాచలం

పార్వతీపురంటౌన్: సీతానగరం మండలం మరిపివలస గ్రామ సమీపంలో లారీ ఢీకొని ఎక్స్ సర్వీస్‌మన్ సోమవారం మృతి చెందారు. దీనిపై ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసకు చెందిన చొక్కాపు సింహాచలం(52) తామరఖండి గ్రామంలో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

భూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: రెవెన్యూ సంబంధిత సమస్యలలో భూ ఆక్రమణల సమస్య పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికలో ప్రకటించారు. వేదికకు వచ్చిన అర్జీలలో..గజపతినగరం మండలం ఎం.వెంకటాపురంలో తన తండ్రి నుంచి తనకు సంక్రమించిన 40 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించారని తాడ్డి నానాజీ అనే వ్యక్తి కలెక్టర్‌కు వినతి అందజేశాడు. దీనిపై అర్జీదారు నుంచి పూర్తి సమాచారం తెలుసుకున్న కలెక్టర్ అర్జీదారుకు చెందిన భూమిలో ఆక్రమణలు తొలగించడంతోపాటు గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు కూడా తొలగించాలని తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని బొబ్బిలి రెవిన్యూ డివిజన్ అధికారిని ఆన్‌లైన్‌లో ఆదేశించారు. ఈ సమస్య పరిష్కరించిన వెంటనే తనకు నివేధిక అందించాలని స్పష్టం చేశారు. అలాగే ఎస్.కోట మండలం ధర్మవరంలో ఎంపీలాడ్స్ నిధులతో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కల్యాణ మంటపాన్ని కబ్జాచేశారని కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా దీనిపై విజయనగరం ఆర్‌డీఓతో ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ కల్యాణ మంటపం వాస్తవ పరిస్థితిపై తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు.

పరిష్కార వేదికకు 143 వినతులు

సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు 143 వినతులు అందాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డీఆర్ఓ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొని వినతులు స్వీకరించారు.

ఎస్పీకి 38 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన 38 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ ఎ.లీలారావు, ఆర్‌వీఆర్ కే.చౌదరి, డీసీఆర్‌బీ సీఐ శంకరరావు, ఎస్సై రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సీతంపేట: విద్యార్థులను అభినందిస్తున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: రాష్ట్రస్థాయిలో ఆంధ్రా వనవాసీ కల్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో ఇటీవల పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన ఆర్చరీ పోటీల్లో దోనుబాయి ఆశ్రమపాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారు. పాఠశాల విద్యార్థులు ఎ.కిరణ్, సవర సూర్యం ప్రతిభ కబరిచి ద్వితీయస్థానంలో నిలిచారు. టీమ్ చాంపియన్ షిప్‌ను కూడా దోనుబాయి విద్యార్థులు దక్కించుకున్నారు. ఈనెల 24న ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు తలపడనున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆ విద్యార్థులను ఐటీడీఏ కార్యాలయంలో ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఈవో నారాయుడు తదితరులు అభినందించారు.

స్పోర్ట్స్‌మీట్‌లో శ్రీనివాస్..



విజయనగరం క్రైమ్: పతకాలు సాధించిన శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో మూడు బంగారు పతకాలను సాధించినట్లు విజయనగరంలోని ఉడా కాలనీకి చెందిన శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 14, 15 తేదీల్లో కృష్ణాజిల్లా గుడివాడలో జరిగిన 44వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో ఆయన పాల్గొని మూడు బంగారు పతకాలు సాధించారు. కంట్రోల్ రూమ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాసిన చంద్రశేఖర్ వద్ద శ్రీనివాస్ స్పోర్ట్స్‌లో శిక్షణ పొందుతుండగా కోచ్‌తో పాటు పలువురు క్రీడాభిమానులు, అధికారులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


టెన్నిస్, వాలీబాల్‌లో కేజీబీవీ విద్యార్థినులు



నెల్లిమర్ల: విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉమ

నెల్లిమర్ల: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు రాష్ట్రస్థాయి 9వ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నిస్, వాలీబాల్ పోటీల్లో సత్తా చాటారు. తాజాగా ఏలూరు జిల్లాలో జరిగిన పోటీల్లో ఈ పాఠశాల, కళాశాల విద్యార్థులు సీహెచ్ హారిక, వై.యామిని, ఎం దాక్షాయని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ప్రిన్సిపాల్ ఉమ, అధ్యాపకులు, ఉపాధ్యాయినులు అభినందించి జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు తోండ్రంగి విద్యార్థిని



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఆలిండియా స్థాయిలో జరగనున్న ఖోఖో పోటీలకు గరివిడి మండలంలోని తోండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చనమల్లు లావణ్య ఎంపికైంది. గత నెల 3,4,5 తేదీల్లో అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పదో తరగతికి చెందిన లావణ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ నెల 21 నుంచి 25 వతేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో జరగనున్న 68వ ఆలిండియా స్థాయి ఖోఖో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనుంది. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాలని కోరుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడలి రమేష్‌కుమార్, పీడీ సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.


అంతర వర్సిటీ ఖోఖో పోటీలకు ఇంద్రావతి



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఎస్‌డీఎస్ కళాశాలకు చెందిన విద్యార్థిని నిద్దాన ఇంద్రావతి అంతర యూనివర్సిటీ ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ నెల 14న ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఖోఖో ఎంపిక పోటీల్లో విద్యార్థిని ప్రతిభ చూపి అర్హత సాధించింది. ఈనెల 27 నుంచి 31 వరకు జరగనున్న అంతర యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఖోఖో టీమ్ తరపున ప్రాతినిధ్యం వహించనుంది.ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని ప్రిన్సిపాల్ బి.రవి,అధ్యాపక సిబ్బంది సురేష్‌కుమార్, కిరణ్‌కుమార్‌లు అభినందించారు.

మన్యం జిల్లా గురుకుల విద్యార్థుల ఎంపిక



సాలూరు రూరల్: జాతీయ పోటీలకు ఎంపికైన బొడ్డవలస గురుకుల విద్యార్థులు

సాలూరు రూరల్: టెన్నిస్, వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయి జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో ఈ నెల 14,15 తేదీలలో గోపన్నపాలెం ఏలూరు జిల్లాలో జరిగిన క్రీడల్లో సాలూరు మండలంలోని బొడ్డవలస గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు అభి, వాసు, యశ్వంత్‌లు పార్వతీపురం మన్యం జిల్లా తరఫున జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ విద్యాసాగర్ తెలిపారు. ఈ నె 29వ తేదీనుంచి 2025 జనవరి 3 వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బిల్లులు లేని సిగరెట్లు సీజ్

బొబ్బిలి: పట్టణానికి చెందిన ఇంకుల రమేష్ (రాయగడ రమేష్) అనే వ్యాపారి ఒడిశా నుంచి ఇన్వాయిస్, బిల్లులు లేకుండా వివిధ కంపెనీలకు చెందిన సిగరెట్లను దిగుమతి చేసుకుంటూ ఏపీలోని పలుప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పట్టుబడిన రాయగడ రమేష్‌ను విచారణ చేయగా తెలియజేసిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాద్, సిబ్బంది బి.రామారావు, పి లక్ష్మీనారాయణ, ఈశ్వరరావులు సిగిరెట్ల నిల్వ కేంద్రాలను గుర్తించి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మొత్తం 6 సిగరెట్ల బేల్స్ స్వాధీనం చేసుకుని జీఎస్టీ అధికారులకు అప్పగించారు.

పెదకుదమలో ఏనుగులు



పెదకుదమ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సోమవారం దర్శనమిచ్చాయి. వరి ధాన్యం కళ్లాల్లో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అరటి, చెరకు, పామాయిల్ పంటలకు నష్టం చేకూర్చే అవకాశం ఉందని, ఏనుగుల తరలింపునకు ప్రభుత్వం చొరవచూపాలని కోరారు.

కొండచీపుర్లను జీసీసీ కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

- గిరిజనులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి
- పాలకొండ మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: కొండచీపుర్లను గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కొనుగోలు చేయాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. సీతంపేటలో స్థానిక విలేకరులతో ఆమె సోమవారం మాట్లాడారు. దళారీలు తక్కువ ధరకు కొండచీపుర్లను కొనుగోలుచేసి గిరిజనుల కష్టాన్ని నిలువునా దోచుకుంటున్నారన్నారు. నాణ్యమైన ఒక్కో కొండచీపురును రూ.35 లోపే కొనుగోలు చేస్తున్నారన్నారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ వంటి ప్రాంతాల్లో ఒక్కో చీపురు మార్కెట్లో రూ.75 వరకు విక్రయిస్తున్నారన్నారు. గ్రామాల్లో కొండచీపుర్ల ఉత్పత్తి బాగా పెరిగిందన్నారు. కొండపోడు వ్యవసాయంలో ఈ పంటలను వేసి ఇంటివద్దే గిరిజనులు చీపుర్లు తయారు చేస్తున్నారన్నారు. ఆరుగాలం కష్టపడుతున్నా తగిన ప్రతిఫలం లేదన్నారు. ఇప్పటికైనా జీసీసీ అధికారులు స్పందించి అన్ని రకాల అటవీ ఉత్పత్తులకు మద్దతు ధరలు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.